సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



ప్రహరీ లేక పరేషాన్

యాదగిరిగుట్ట మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో పశువులు సంచరిస్తున్నాయి.

-9లో



ప్రశ్నార్థకం చేయొద్దు

సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుచేసి తమ భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేయవద్దని విద్యార్థులు మానవహారం నిర్వహించారు.

- 9లో



దేశభక్తుల సంస్థ ఆర్‌ఎస్‌ఎస్

ఆర్‌ఎస్‌ఎస్ దేశభక్తులను తయారు చేసే సంస్థ అని, ఇది దేశానికే గర్వకారణమని ప్రజ్ఞేష్ పర్మర్ పేర్కొన్నారు.

- 9లో

న్యూస్‌రీల్

యాదగిరిగుట్ట మండల ప్రజలకూ ఉచిత దర్శనం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి గర్భాలయంలో స్వయంభూలను ప్రతి మంగళవారం, శనివారం రోజుల్లో ఉదయం 8.15నుంచి 9గంటల వరకు ఆధార్‌కార్డు ధ్రువీకరణ. సంప్రదాయ దుస్తులతో ఉచితంగా దర్శించుకునేందుకు యాదగిరిగుట్ట మండల ప్రజలకు సైతం దేవస్థానం అవకాశం కల్పించింది. గతంలో యాదగిరిగుట్ట మున్సిపాలిటీ ప్రజలకు మాత్రమే ఈ అవకాశం ఉండేదని, ఇక నుంచి మండల ప్రజలు కూడా స్వామివారిని దర్శించుకోవచ్చని ఈఓ భాస్కర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం తీసుకున్న నిర్ణయంతో గుట్ట మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ సాహస శిబిరానికి ఎంపిక


స్రవంతి


ప్రతిభ

బీబీనగర్ : మండలంలోని లక్ష్మీదేవిగూడెం పరిధిలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి స్రవంతి, బీఏ తృతీయ సంవత్సరం విద్యార్థి ప్రతిభ జాతీయ సాహస శిబిరం–2024 ఎంపికయ్యారు. ఈనెల 22నుంచి 31వ తేదీ వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని అటల్‌బిహారీ వాజ్‌పేయి పర్వతారోహణ శిక్షణ సంస్థలో పర్వతారోహణ, పారా గ్లైడింగ్, రివర్ రాఫ్టింగ్, తదితర సాహస క్రీడల్లో శిక్షణ పొందనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నిరూప తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి


మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

ఆత్మకూరు(ఎం): జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి జాప్యం చేయకుండా ధాన్యం సేకరణ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. శనివారం ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలో జరిగిన సీపీఎం మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించకపోవడం వల్ల రైతులు రేయింబవళ్లు అక్కడే నిరీక్షిస్తున్నారని, మబ్బులు కమ్ముకోవడంతో ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అదే విధంగా యాసంగి సీజన్ మొదలుకానుందని,వెంటనే రైతుభరోసా నిధులు విడుదల చేయాలని కోరారు. మూసీ ఆధారితంగా నిర్మించిన పిలాయిపల్లి, ధర్మారెడ్డి, బునాదిగాని కాల్వల ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, బోలగాని జయరాములు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి మైళ్ల యాదిరెడ్డి, మండల కార్యదర్శి వేముల భిక్షం, నాయకులు రచ్చ గోవర్ధన్, వంటిపెంటి గోపాల్‌రెడ్డి, గుణమోని స్వామి, రాచమల్ల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు చేయూతనిద్దాం


చేనేత వస్త్రాలు ధరించి విధులకు హాజరైన పోచంపల్లి కో-ఆపరేటివ్ బ్యాంకు సిబ్బంది

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి కో–ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగులు చేనేతకు చేయూతనిస్తున్నారు. ప్రతి శనివారం చేనేత వస్త్రాలు ధరించాలని, ఇక్కత్ వస్త్రాలను ప్రమోట్ చేయాలని ఇటీవల బ్యాంకు చైర్మన్ తడక రమేశ్, పాలకవర్గం నిర్ణయించింది. అందులో భాగంగా శనివారం పోచంపల్లి బ్యాంకు మేనేజర్ రచ్చ శ్రీనివాస్‌తో సహా సిబ్బంది అంతా ఒకే రంగు, డిజైన్ కల్గిన చేనేత వస్త్రాలు ధరించి విధులకు హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ చేనేతకు చేయూతనివ్వాలని కోరారు.



కొలువుల కుటుంబం

పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించడం ఎంతో సులువు. ఇందుకు పలు కుటుంబాలు ఉదాహరణగా నిలుస్తున్నాయి. కొన్ని కుటుంబాల్లో పిల్లలంతా ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తూ.. ఔరా అనిపిస్తున్నారు. ఇక కొందరు రెండు, మూడు ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు.

- వివరాలు 8లో

వాటర్‌మెన్లకు ముగిసిన శిక్షణ

భువనగిరి : గ్రామ పంచాయతీల్లోని తాగునీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న వాటర్‌మెన్లకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. భువనగిరి ఎంపీడీఓ కార్యాలయంలో ముగింపు కార్యక్రమానికి మిషన్ భగీరథ సీఈ లలిత, జెడ్పీసీఈఓ శోభారాణి హాజరై మాట్లాడారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయడంలో వాటర్‌మెన్లే కీలకమన్నారు. పైపులైన్ల నిరంతర పర్యవేక్షణ ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, మిషన్‌భగీరథ గ్రిడ్ డీఈఈ ఏఈఈలు గుండురావ్, శ్రీలత, ల్యాబ్ సిబ్బంది ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

పైసా విదిల్చలే..!

కాగితాలపైనే సీడీఎఫ్ నిధులు.. 9 నెలలైనా విడుదల చేయని ప్రభుత్వం


సీడీఎఫ్ నిధులతో యాదగిరిగుట్ట మండలం చొల్లేరులో నిర్మించిన సీసీ రోడ్డు


ఆత్మకూర్(ఎం) మండలం రహీంఖాన్‌పేటలో పూర్తయిన కల్వర్టు

- నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున మంజూరు
- తొమ్మిది నెలలైనా నిధులు విడుదల చేయకుండా జాప్యం
- మొత్తం 332 పనులకు ప్రతిపాదనలు
- పూర్తయిన వాటికి అందని బిల్లులు
- బిల్లులు రాక కొన్ని నిర్మాణాలు నిలిపివేత
- కుంటుపడుతున్న అభివృద్ధి

సాక్షి, యాదాద్రి : ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి నిధులు (సీడీఎఫ్) కాగితాలకే పరిమితం అయ్యాయి. తొమ్మిది నెలల క్రితమే నిధులు మంజూరైనా ప్రభుత్వం ఇప్పటి వరకు పైసా విదిల్చలేదు. ఫలితంగా అనేక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. పూర్తయిన పనులకు బిల్లులు ఎప్పుడు అందుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం నియోజకవర్గాల అభివృద్ధి కోసం ఒక్కో ఎమ్మెల్యేలకు రూ.10 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేసింది. జిల్లాలో ఆలేరు, భువనగిరి నియోజకవర్గాలు పూర్తిగా ఉండగా.. మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల్లోని పలు మండలాలు జిల్లా పరిధిలో ఉన్నాయి. మంజూరైన నిధులతో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సమక్షంలో అధికారులు వివిధ పనులకు ప్రతిపాదనలు రూపొందించారు. వీటిలో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని కొనసాగుతున్నాయి. బిల్లులు రాక ఇంకొన్ని నిలిచిపోయాయి.

గత ప్రభుత్వం నుంచే 'సీడీఎఫ్'

గత ప్రభుత్వ హయాం నుంచే నియోజకవర్గాలకు నియోజకవర్గ అభివృద్ధి నిధులు వస్తున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఏటా రూ.1.50 కోట్లు ఇచ్చింది. ఆ మొత్తాన్ని క్రమంగా రూ.3 కోట్లు, ఆ తరువాత రూ.5 కోట్లకు పెంచింది. కాగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సీడీఎఫ్ నిధులను భారీగా పెంచింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.10కోట్ల చొప్పున మంజూరు చేసింది.

వీటికి కేటాయింపులు..

ప్రభుత్వం మంజూరు చేసిన సీడీఎఫ్ నిధులకు వివిధ అవసరాలకు కేటాయించారు. తాగునీటి అవసరాలకు రూ.కోటి, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.2 కోట్లు, ప్రభుత్వ కార్యాలయాల మరమ్మతులకు రూ.50 లక్షలు కేటాయించారు. ఇవిపోను మిగతా రూ.6.50 కోట్లను రోడ్లు, డ్రెయినేజీలు, కమ్యూనిటీ భవనాలు, కమిటీ హాళ్లు, అంగన్‌వాడీ భవనాలు, విద్యుదీకరణ తదితర వాటికి కేటాయించారు. ప్రతిపాదించిన పనుల్లో మౌలిక వసతులకు సంబంధించిన పనులన్నీ దాదాపు పూర్తయ్యాయి. సీసీ రోడ్లు, కల్వర్టులు, డ్రెయినేజీలకు సంబంధించిన పనులు కొన్నిచోట్ల కొనసాగుతున్నాయి. అయితే పూర్తయిన పనులకు బిల్లులు రాకపోవడంతో మిగతా పనులను నిలిపివేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 322 పనులకు అధికారులకు ప్రతిపాదనలు రూపొందించారు.

చేపట్టిన పనుల్లో కొన్ని..

- యాదగిరిగుట్ట మండలంలోని ప్రతి గ్రామానికి రూ.25 లక్షల చొప్పున సీడీఎఫ్ నిధులు కేటాయించారు. ఈ నిధులతో 22 గ్రామాల్లో పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్లు సొంత నిధులతో పనులు పూర్తి చేశారు.
- రాజాపేట మండల పరిధిలో పలు గ్రామాలకు రూ.35 లక్షలు కేటాయించారు. పనులు అగ్రిమెంట్ దశలోనే ఉన్నాయి.
- ఆత్మకూరు(ఎం) మండలంలోని రహీంఖాన్‌పేట చెరువు కాలువపై రూ.5 లక్షలతో కల్వర్టు నిర్మించారు.
- మోటకొండూర్ మండలంలోని చాడ, దిల్వార్పూర్, ఇక్కుర్తి, మోటకొండూర్, కదిరేణిగూడెం, అమ్మనబోలు, తేర్యాల గ్రామాల్లో తాగునీటి అవసరాల కోసం రూ.19.3లక్షలు కేటాయించారు.ఈ నిధులతో పైపులైన్లు వేశారు.
- భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌కు రూ.60 లక్షల నిధులు కేటాయించారు. ఈ నిధుల్లో రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, రూ. 30 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీలు నిర్మించారు. పనులు పూర్తి కావడంతో కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు.
- భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీల్లోనూ వివిధ పనులు చేపట్టి పూర్తి చేశారు. కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి.

రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు

- మూసీ ప్రక్షాళనకు కార్యాచరణ
- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

సాక్షి,యాదాద్రి : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి మహర్దశ పట్టిందని, వివిధ అభివృద్ధి పనులకోసం ఇప్పటి వరకు రూ.800 కోట్లుకు పైగా నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం భువనగిరిలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాలువల ఆధునీకరణకు రూ.500 కోట్లు, రోడ్లు, పాఠశాలల్లో మౌలిక వసతులు, తాగునీటి అవసరాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రూ.300 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. రానున్న మూడేళ్లలో భువనగిరి నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. మూసీని ప్రక్షాళన చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడితే బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీష్‌రావు అడ్డుకునే యత్నం చేస్తున్నారని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన కోసం జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. భువనగిరిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను మూడు నెలల్లో అందుబాటులోకి తీసుకువస్తామని, పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు ప్రమోద్‌కుమార్, బర్రె జహంగీర్, బీసుకుంట్ల సత్యనారాయణ, ఎలిమినేటి కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి క్షేత్రంలో సంప్రదాయ పూజలు


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రధానాలయ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడవీధిలో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. వేద ఆశీర్వచనం, సువర్ణపుష్పార్చన, నిత్యకల్యాణ వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

ఎంజీయూను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

- వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఖాజాఅల్తాఫ్ హుస్సేన్


వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఖాజాఅల్తాఫ్ హుస్సేన్

ఎంజీయు(నల్లగొండ రూరల్): మహాత్మాగాంధీ యూనివర్సిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ (వీసీ) ఖాజాఅల్తాఫ్ హుస్సేన్ అన్నారు. శనివారం ఎంజీయూ వీసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ వీసీగా గతంలో 2016 నుంచి 2019 వరకు పనిచేసిన అనుభవంతో యూనివర్సిటీ అభివృద్ధికి బాటలు వేస్తానన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంచి విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణించేందుకు పెద్దపీట వేస్తామన్నారు. అనంతరం వీసీకి యూనివర్సిటీ సిబ్బంది ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్డీ అంజిరెడ్డి, సీఓఈ ఉపేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ అరుణప్రియ, ఎంవీఎన్.రెడ్డి, ప్రేమ్‌సాగర్, సుధారాణి, రమేష్, అన్నపూర్ణ, రేఖ, రూప, వసంత, మాధురి, సబీనా పాల్గొన్నారు.


రామన్నపేట సబ్‌కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్రీదేవి, జస్టిస్ లక్ష్మణ్, చిత్రంలో కలెక్టర్ హనుమంతు కే.జెండగే, డీసీపీ రాజేష్‌చంద్ర, న్యాయవాదులు

కోర్టుల స్థలం పరిశీలించిన జడ్జీలు


కోర్టుల ఏర్పాటుకు కేటాయించిన స్థలం గురించి కలెక్టర్‌తో చర్చిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

రామన్నపేట : రామన్నపేట శివారులో వివిధ కోర్టుల ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జువ్వాది శ్రీదేవి, జస్టిస్ కూనూరు లక్ష్మణ్‌లు శనివారం పరిశీలించారు. కోర్టు భవనాల వద్దకు దారి, విద్యుత్ స్తంభాలు తదితర అంశాలపై ఆరా తీశారు. కలెక్టర్ హనుమంతు కే.జెండగే, బార్ అసోసియేషన్ సభ్యులతో చర్చించి పలు సూచనలు చేశారు. కోర్టుల వద్దకు వెళ్లే దారిలో ఉన్న ధర్మారెడ్డి కాలువపై వంతెన నిర్మించాలని న్యాయవాదులు ఈ సందర్భంగా వారి దృష్టికి తీసుకెళ్లారు. అంతకుముందు హైకోర్టు న్యామూర్తులు సబ్‌కోర్టును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజేష్‌చంద్ర తహసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకుబ్‌నాయక్, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ మజీద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రద్దు చేయొద్దు

- మోత్కూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ధర్నా



ఇంచార్జి సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు

మోత్కూరు : మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రద్దు చేసే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లు తక్కువగా అవుతున్నాయని, ఆదాయం పడిపోయిందని కార్యాలయాన్ని గుట్టుచప్పుడు కాకుండా మరో ప్రాంతానికి తరలించడానికి కుట్ర జరుగుతుందని ఆరోపించారు. కార్యాలయాన్ని రద్దు చేయడం ద్వారా మోత్కూరుతో పాటు ఆత్మకూర్(ఎం), గుండాల, అడ్డగూడూరు మండలాల ప్రజలకు అసౌకర్యం కలగనుందన్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో భూముల ధరలు కూడా తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న మోత్కూరును మళ్లీ వెనక్కి నెట్టవద్దని పేర్కొన్నారు. అన్ని సదుపాయాలు ఉన్న మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. అనంతరం ఇంచార్జి సబ్ రిజిస్ట్రార్ రజియాసుల్తానాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంఘం మండల అధ్యక్షుడు మహ్మద్ అలీ, సంఘం నాయకులు కారుపోతుల వెంకన్న, జంగ శ్రీనివాస్, మహ్మద్ సమీర్, నిమ్మల శ్రీనివాస్, హైమద్, మెంట నగేష్, కె.నరేందర్‌రెడ్డి, తొగిటి కృష్ణ, సజ్జనం నాగేందర్, బయ్యని నవీన్, దామరోజు సోమలింగాచారి, బండారు వేణు, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో ధరల మంట

దిగిరాని కూరగాయల రేట్లు

- హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి మార్కెట్ నుంచి పెరిగిన దిగుమతులు
- అయినా అధిక ధరలకే విక్రయం
- పర్యవేక్షణ లేక వ్యాపారుల ఇష్టారాజ్యం
- ఇబ్బందులు పడుతున్న భువనగిరి ప్రజలు


కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

భువనగిరిటౌన్ : కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టినా భువనగిరి రైతుబజార్‌లో పాత రేట్లకే విక్రయిస్తున్నారు. ప్రతి కూరగాయలపై పది రూపాయల వరకు ఎక్కువ తీసుకుంటున్నారు. పర్యవేక్షించాల్సిన మార్కెటింగ్ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో వ్యాపారులు నిర్ణయించిందే రేటు అవుతుంది.

బోయిన్‌పల్లి మార్కెట్ ఆధారంగా ధరలు నిర్ణయం

పది రోజుల క్రితం వరకు అధికంగా ఉన్న కూరగాయల ధరలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి మార్కెట్‌కు పెద్ద ఎత్తున కూరగాయలు వస్తుండడంతో జిల్లా మార్కెట్‌లు, రైతుబజార్లకు అక్కడినుంచి దిగుమతి పెరిగాయి. ఈ క్రమంలో భువనగిరి రైతుబజార్‌లో ధరలు తగ్గాల్సి ఉంది. కానీ, ఎప్పటి రేట్లకే విక్రయిస్తున్నట్లు కొనుగోలుదారులు వాపోతున్నారు. బోయిన్‌పల్లి మార్కెట్ రేట్ల ప్రకారంగా భువనగిరి రైతుబజార్‌లో ధరలు నిర్ణయిస్తారు. రోజువారీ రేట్లను నోటీస్ బోర్డుపై ప్రదర్శిస్తారు. కానీ, వ్యాపారులు నిర్ణయించిన రేట్ల కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

కూరగాయల ధరలు కిలో (రూ.ల్లో)

రకం	నిర్ణయించిన ధర	అమ్ముతున్న ధర
టమాట	43	48
వంకాయ	35	40
బిన్నీస్	65	80
పచ్చిమిర్చి	40	46
కాకర	35	46
క్యాబేజీ	26	32
క్యారెట్	53	60
దొండ	35	44
ఆలుగడ్డ	37	44
గోకర	40	46
కీరదోస	23	30

ఎస్టేట్ అధికారి లేరు

రైతుబజార్‌లో పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఎస్టేట్ అధికారి లేరు. ఇంచార్జితో నెట్టుకొస్తున్నారు. మరోవైపు మార్కెటింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడంతో వ్యాపారులు ధరలు పెంచి అమ్ముతున్నారు. కిలోపై రూ.5నుంచి రూ.10 పెంచి అమ్మకాలు చేపడుతున్నారు. బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో టమాట రూ.40 పలుకుతుండగా ఇక్కడ కిలో రూ.48కి విక్రయిస్తున్నారు. మిగతా కూరగాయలదీ అదే పరిస్థితి.

ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు


స్థానిక రైతులు తెచ్చి నిర్ణయించిన ధర ప్రకారమే కూరగాయల అమ్మకాలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే కూరగాయలు వాహనాల కిరాయి, హమాలీల కూలి పోను అమ్మకాలు సాగిస్తున్నా. ఎక్కువ ధరలకు అమ్మడం లేదు. వ్యాపారులు ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

– సాయి కిశోర్, ఇంచార్జి ఎస్టేట్ అధికారి

ఎన్నెన్నో వర్ణాలు..

జిల్లాలో శనివారం యాదాద్రికొండపై, భూదాన్ పోచంపల్లి, రామన్నపేట, భువనగిరి మండలం ఆకుతోటబాయితండా సమీపంలో ఏర్పడిన ఇంద్రధనస్సులు చూపరులను కనువిందు చేశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ కాసినప్పటికీ ఒక్కసారిగా వాతావరణం చల్లబడి చిరుజల్లులు కురిశాయి. అదే సమయంలో ఏర్పడిన హరివిల్లులు ఆకట్టుకున్నాయి. ఈ దృశ్యాలను పలువురు సెల్‌ఫోన్లలో బంధించారు.

–సాక్షి యాదాద్రి, యాదగిరిగుట్ట, భూదాన్‌పోచంపల్లి, రామన్నపేట


యాదాద్రి కొండపై ఇంద్రధనస్సు..


పోచంపల్లిలో..


ఆకుతోటబాయితండాలో..


జనంపల్లిలో..

క్లుప్తంగా

సాగర్‌లో కేంద్ర జల సంఘం చీఫ్ ఇంజనీర్



చీఫ్ ఇంజనీర్ నిత్యానంద ముఖర్జీతో సాగర్ డ్యాం ఇంజనీర్లు

నాగార్జునసాగర్: కేంద్ర జల సంఘం చీఫ్ ఇంజనీర్ నిత్యానంద ముఖర్జీ శనివారం సాయంత్రం నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. డ్యాం అధికారులతో వరదల గురించి చర్చించారు. అంతకుముందు హాలియా సమీపంలో గల సెంట్రల్ వాటర్ కమిషన్‌కు చెందిన నీటి లెక్కింపు సెంటర్‌ను సందర్శించారు. లోయర్ కృష్ణ సబ్‌డివిజన్–1 మిర్యాలగూడ, సీడబ్ల్యూసీ వైర్‌లెస్ స్టేషన్‌ను, టెలిమెట్రిని సందర్శించారు. ఆయన వెంట డ్యాం ఈఈ మల్లికార్జున్, ఏఈఈ కృష్ణయ్య ఉన్నారు.

అంతరిక్ష దినోత్సవ క్విజ్‌లో సత్తాచాటిన కోదాడ విద్యార్థి



హర్షవర్ధన్‌రెడ్డిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కోదాడరూరల్: భారత అంతరిక్ష పరిశోధ సంస్థ(ఇస్రో), కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 30 వరకు జాతీయ అంతరిక్ష దినోత్సవ క్విజ్–2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 3,66,308 మంది విద్యార్థులు పాల్గొనగా మొదటి వంద మందిలో కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో గల తేజ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి గుజ్జుల హర్షవర్ధన్‌రెడ్డి స్థానం సంపాదించాడు. ఈ వంద మందిని ఇస్రో ఈ నెల 23న శ్రీహరికోటను సందర్శనకు తీసుకెళ్లనున్నారు. శనివారం పాఠశాలలో ప్రిన్సిపాల్ రమాదేవితో పాటు ఉపాధ్యాయులు హర్షవర్ధన్‌రెడ్డిని అభినందించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తికి చేయూత



విరాళాలు సేకరిస్తున్న కాలనీవాసులు

మునగాల: మండల కేంద్రంలోని హరిజన కాలనీకి చెందిన లంజేపల్లి సైదులు ఈనెల 9వ తేదీన విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన సైదులు వైద్యానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతుండగా.. శనివారం సాక్షి దినపత్రికలో ‘దాతలు ఆదుకుంటేనే గండం గడిచేది’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పలువురు దాతలు ఆర్థిక సాయం అందిస్తున్నారు. హరిజన కాలనీకి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు ఎల్. శ్రీను, సామాజిక కార్యకర్త జి.సైదులు ఆధ్వర్యంలో కాలనీలో విరాళాల ద్వారా సుమారు రూ.16వేలు సేకరించారు. ఫోన్ పే ద్వారా రూ.14వేలు వచ్చినట్లు సైదులు స్నేహితులు రవి, వీరబాబు తెలిపారు. తమ స్నేహితుడి దీనస్థితిని వెలుగులోకి తీసుకువచ్చిన సాక్షి దినపత్రిక యాజమాన్యానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

కొలువుల కుటుంబం

కన్నవారికి కలలను నెరవేర్చిన పిల్లలు

పిల్లలు ఉన్నతస్థానంలో నిలవాలని ప్రతి తల్లిదండ్రీ ఆంకాంక్ష. తాము పడ్డ బాధలు తమ పిల్లలు పడొద్దని భావిస్తుంటారు. అందుకే తమ కష్టం తెలియకుండానే పిల్లలు పెంచి ప్రయోజకులను చేసేందుకు ప్రయత్నిస్తుంటారు. అలా కొన్ని కుటుంబాల్లో తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పిల్లలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఇంకొందరు తల్లిదండ్రులు ఉద్యోగస్తులైతే వారిని స్ఫూర్తిగా తీసుకుని సర్కార్ కొలువు పొందారు.

స్ఫూర్తి

పిల్లలిద్దరూ ప్రభుత్వ కొలువులో..



అమ్మానాన్నతో సింధూజ, శశిధర్, శ్రీధర్

నాంపల్లి : మండలంలోని రాందాస్‌తండాకు చెందిన మెగావత్ రాందాస్, సరోజా దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను చదవించారు. తల్లిదండ్రుల కష్టాన్ని వమ్ము చేయకుండా ఇద్దరు పిల్లలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా.. చిన్నవాడు ఎంబీబీఎస్ చదువుతున్నాడు. కుమార్తె సింధూజ ఇటీవల విడుదలైన జేఎల్ ఫలితాల్లో బాటనీ లెక్చరర్‌గా ఎంపికై ంది. పెద్ద కూమారుడు శశిధర్ నాలుగు ప్రభుత్వ (ఆర్టీఓ, జెన్‌కో అసిస్టెంట్ ఇంజనీరు, భెల్ ఇంజనీర్, గ్రూప్–4) ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం గ్రూప్–1 మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఇక చిన్న కుమారుడు శ్రీధర్ సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. పిల్లలను పదో తరగతి వరకు గ్రామానికి సమీప పాఠశాలల్లోనే చదివించానని.. పైచదువుల కోసం కుటుంబంతో సహా హైదరాబాద్ వెళ్లి పని చేసుకుంటూ వారిని చదివించానని.. ఇప్పుడు వాళ్లు ఉద్యోగాలు సాధించడం చెప్పలేని సంతోషాన్ని కలిగిస్తోందని తండ్రి రాందాస్ పేర్కొన్నారు.

అక్కా, చెల్లెలు అదుర్స్



తల్లిదండ్రులు సోదరుడితో పందిరి తేజస్విని, ప్రియాంక

కోదాడ : వారిది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు పెద్దగా చదువుకోలేదు. కానీ చదువు విలువ తెలిసినవారు. చదువే తమ పిల్లలను ఉన్నతులుగా తీర్చుదిద్దుతుందని భావించి చదివించారు. చిన్నతనం నుంచి స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివిన వీరు రెండేసీ ఉద్యోగాలు సాధించి పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. చిలుకూరు మండల జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన పందిరి అమృతరెడ్డి–లక్ష్మి దంపతులకు కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె లంకెల తేజస్విని పదో తరగతి వరకు స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివిన అనంతరం కోదాడలో ఇంజనీరింగ్ పూర్తి చేసింది. అనంతరం టీటీసీ, ఎల్ఎల్‌బీ పూర్తి చేసింది. 2020లో జైల్ వార్డర్‌గా ఉద్యోగం సాధించింది. ఈ ఉద్యోగం చేస్తూనే 2024 డీఎస్సీలో ఉపాధ్యాయురాలిగా ఎంపికై చింతలపాలెం మండలం వజినేపల్లిలో విధులు నిర్వహిస్తుంది. ఈమె చెల్లెలు ప్రియాంక కూడా టెన్త్ తరగతి వరకు స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదవి అనంతరం కోదాడలో ఇంజనీరింగ్, హైదరాబాద్‌లో ఎంటెక్ పూర్తి చేసింది. కొంతకాలం పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసింది. 2023లో సివిల్ ఎస్‌ఐగా ఎంపికై.. శిక్షణ పూర్తి చేసుకుని ప్రొబేషనరీ ఎస్‌ఐగా చర్లపల్లి స్టేషన్‌లో విధులు నిర్వహిస్తోంది. ఈమె ఇటీవల ప్రకటించిన గ్రూప్–4 పరీక్షలో కూడా మంచి ర్యాంక్ సాధించింది. సోమవారం నుంచి జరగబోయే గ్రూప్–1 మెయిన్స్‌కు సిద్ధమవుతోంది. వీరి సోదరుడు శ్రీకాంత్‌రెడ్డి ఎంటెక్ పూర్తి చేసి బిల్డింగ్ ప్లానర్‌గా పని చేస్తున్నాడు. గ్రూప్–1 సర్వీస్‌లు సాధించడమే లక్ష్యమని వారంతా పేర్కొంటున్నారు.



పోతరాజు వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులు

నలుగురూ ఉద్యోగులే..

రామన్నపేట : రామన్నపేటకు చెందిన ఉపాధ్యాయుడు పోతరాజు వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులు నలుగురు ఉద్యోగులే. పట్టణానికి చెందిన పోతరాజు ఈశ్వరయ్య–లక్ష్మమ్మ కుమారుడైన వెంకటేశ్వర్లు స్థానిక ప్రభుత్వ పాఠశాలలు కళాశాలల్లో విద్యనభ్యసించాడు. చిన్నప్పుడు హోటల్ నిర్వహణలో తండ్రికి సహాయపడుతూ 1996లో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. ప్రస్తుతం పోచంపల్లి మండలం పిల్లాయిపల్లి ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. అతని భార్య శారద మహాత్మా జ్యోతీరావుపూలే పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు. వీరి కుమారుడు సుశాంత్ మద్రాస్ ఐఐటీలో ఎంటెక్‌పూర్తి చేసి ఇంటెల్‌కోర్‌లో జాబ్ చేస్తున్నారు. కోడలు పావని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బీటెక్ పూర్తి చేసి ఇటీవలే ఆర్ అండ్ బీలో సహాయ ఇంజనీరు ఉద్యోగం సాధించింది. పాలిటెక్నిక్ లెక్చరర్‌గా కూడా ఎంపికైంది. ఇలా ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉద్యోగాలు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆ కుటుంబంలో ఆరుగురు..

అడ్డగూడూరు : మండలంలో లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన కంచుగట్ల పెద్ద వీరయ్య, గంగమ్మ దంపతులది మధ్య తరగతి రైతు కుటుంబం. వారికి ముగ్గురు కూమారులు కంచుగట్ల వెంకన్న, కృష్ణయ్య, శ్రీశైలం, ఒక కూతురు భద్రమ్మ ఉన్నారు. వీరయ్య తనకున్న భూమిలో వ్యవసాయం, ఇతర కూలి పనులు చేసుకుంటూ కష్టపడి తమ నలుగురు పిల్లలను చదవించారు. పెద్దకుమారుడు కంచుగట్ల వెంకన్న బీఈడీ 2001లో ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యాడు. ఆనాటి నుంచి తన తోబుట్టువులు కూడా చదువుకునేలా సహకారం అందించాడు. దీంతో వీరయ్య రెండవ కుమారుడు కంచుగట్ల కృష్ణయ్య 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగాన్ని సాధించాడు. ప్రస్తుతం భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెంలో విధులు నిర్వహిస్తున్నాడు. కృష్ణయ్య భార్య నాగమ్మ 2010 ఉపాధ్యాయురాలిగా ఎంపికై ంది. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో విధులు నిర్వహిస్తున్నారు. వీరయ్య కూతురు భద్రమ్మ 2014లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికైంది. చిన్న కుమారుడు శ్రీశైలం 2018లో ఏఈఓగా ఎంపికై ప్రస్తుతం భువనగిరి మండలం అనాజిపురం క్లస్టర్‌లో పని చేస్తున్నారు. శ్రీశైలం భార్య రాధిక పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఇలా ఈ కుటుంబంలో ఆరుగురు ప్రభుత్వ ఉద్యోగులున్నారు.



కంచుగట్ల వీరయ్య కుటుంబ సభ్యులు



రాంరెడ్డి కుటుంబ సభ్యులు

ఇద్దరు కొడుకులు.. ఒక కోడలు..

గుండాల : గుండాల మండలంలోని అంబాల గ్రామానికి చెందిన భీమిడి రాంరెడ్డి, జానమ్మకు ముగ్గురు కుమారులు. వారిలో ఇద్దరు కుమారులు, ఒక కోడలు ప్రభుత్వ కొలువులు సాధించారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వీరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. పెద్ద కుమారుడు భీమిడి వెంకట్‌రెడ్డి 2007లో ఎస్‌ఐగా ఎంపికయ్యారు. చిన్నవాడైన భీమిడి అమరేందర్‌రెడ్డి 2013లో ఫైర్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. రెండవ కుమారుడు భీమిడి శేఖర్‌రెడ్డి ప్రోత్సాహంతో అతని భార్య భీమిడి వాణి ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. ప్రస్తుతం ఆమె భువనగిరి జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం మొదటి కుమారుడు వెంకట్‌రెడ్డి హైదరాబాద్‌లో సీఐగా ప్రమోషన్ పొంది విధులు నిర్వర్తిస్తున్నారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరిన ఉద్యోగులను పలువురు అభినందిస్తున్నారు.



తల్లి సత్తెమ్మతో హరికృష్ణ, సామ్రాజ్యం, వరలక్ష్మి

ముగ్గురూ ఉపాధ్యాయ వృత్తిలోనే..

కొండమల్లేపల్లి : భర్త అకాల మరణం పొందినప్పటికీ ఆ మహిళ ఏనాడు ధైర్యాన్ని కోల్పోకుండా కష్టపడి తన ముగ్గురు సంతానాన్ని ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన వైనం నేటి సమాజానికి ఆదర్శం. కొండమల్లేపల్లి బీసీ కాలనీకి చెందిన ఎరుకల నారయ్యగౌడ్–సత్తెమ్మ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. నారయ్యగౌడ్ 2006లో హఠాన్మరణం పొందాడు. దీంతో భార్య సత్తెమ్మ కష్టాలను దిగమింగుతూ ముగ్గురు పిల్లలను ఉన్నత చదువులు చదివించి ప్రయోజకులను చేసింది. హరికృష్ణ ఎంఎస్సీ, ఎంఈడీ పూర్తి చేసి 2017లో మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల దేవరకొండలో టీజీటీగా ఉద్యోగం పొంది.. 2023లో జేఎల్‌గా ఉద్యోగం సాధించాడు. పెద్ద కుమార్తె సామ్రాజ్యం బీఎస్సీ టీటీసీ, బీఈడీ పూర్తి చేసి 2008లో ఎస్జీటీగా ఉద్యోగం సాధించింది. చిన్న కుమార్తె వరలక్ష్మి బీఎస్సీ, టీటీసీ పూర్తి చేసి 2012లో ఎస్జీటీగా ఎంపికైంది. పిల్లలు ముగ్గురు పిల్లలు ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడడంతో సత్యమ్మ ఆనందం వ్యక్తం చేస్తోంది.

అన్నదమ్ములిద్దరూ ఉపాధ్యాయులే..

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన మొలకల అచ్చయ్య, సత్యలక్ష్మి దంపతులది సన్నకారు రైతు కూలీ కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం చేయడంతో ఆమె అత్తగారింటికి వెళ్లింది. పెద్ద కుమారుడు వెంకటేశ్వర్లు డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. చిన్న కుమారుడు శ్యాం గురుకుల పాఠశాలలో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. వెంకటేశ్వర్లు తాను చదువుకున్న మోత్కూరు జెడ్పీహెచ్ఎస్‌లోనే స్కూల్ అసిస్టెంట్ తెలుగు టీచర్‌గా జాయిన్ అయ్యారు. శ్యాం తమ సొంతూరైన మోత్కూరు ఎస్సీ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో కెమిస్ట్రీ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై మూడు నెలలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇద్దరు అన్నదమ్ములు ఒక పక్క చదువుకుంటూనే సెలవుల్లో వ్యవసాయ, ఇతర కూలీ పనులకు వెళ్లేవారు. ఇద్దరు కుమారులు కష్టపడి పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడంతో తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.



టీచర్లుగా ఎంపికైన కుమారులతో తల్లిదండ్రులు

కుటుంబమంతా ఉపాధ్యాయులుగానే..

గుండాల : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గవ్వల కుమారస్వామి, కమలమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. తండ్రి ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఆయన స్ఫూర్తితో కుమారులు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. పెద్ద కుమారుడు గవ్వల అమరేందర్ 2009లో పీఈటీగా ఎంపికకాగా.. అతని సోదరుడు గవ్వల మల్లేష్ 2010లో ఎస్‌జీటీ ఉద్యోగం సాధించాడు. ఉపాధ్యాయుడైన తండ్రి బాటలోనే ఇద్దరు అన్నదమ్ములు ఉద్యోగాలు సాధించి పలువురి ప్రశంసలు అందుకున్నారు.



బ్రాహ్మణపల్లికి చెందిన ఉపాధ్యాయులు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నాంపల్లి: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నాంపల్లి మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండలం కొల్‌ముంతాల్‌పహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని బాబూజీనగర్‌కు చెందిన బేరింగిల యాదయ్య(40)కు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలీ పనుల కోసం యాదయ్య భార్యాపిల్లలతో కలిసి 20 రోజుల క్రితం నాంపల్లి మండల కేంద్రంలో ఉంటున్న తన బంధువుల వద్దకు వచ్చాడు. బంధువుల ఇంటి పక్కనే అద్దెకు దిగాడు. మద్యానికి బానిసైన యాదయ్య నిత్యం భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. శుక్రవారం రాత్రి కూడా యాదయ్య మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. దీంతో ఆమె పక్కనే తన బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో రాత్రి 10గంటలకు యాదయ్య ఇంట్లో ఉరేసుకున్నాడు. అర్ధరాత్రి అవుతున్నా ఇంట్లో చప్పుడు కాకపోవడంతో పక్కనే ఉన్న బంధువులు, భార్య వచ్చి చూడగా.. అప్పటికే యాదయ్య మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమితం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తమ్ముడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

అప్పు తీర్చలేదని ఇంటికి చెప్పులు, చీపురుతో తోరణం

- ఏడుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు

ఆత్మకూర్(ఎస్) : అప్పు తీసుకొని తిరిగి చెల్లించడం లేదంటూ అప్పు ఇచ్చిన వారు అప్పు తీసుకున్న మహిళ ఇంటికి చెప్పులు, చీపురు, పాత చాటలతో తోరణం ఏర్పాటు చేసి గ్రామంలో చాటింపు వేయించారు. ఈ ఘటనపై మహిళ ఫిర్యాదు చేయడంతో ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం అస్లా తండాకు చెందిన వాంకుడోత్ కీమా, అనిత భార్యాభర్తలు. కీమా మూడు సంవత్సరాలకు ముందు అదే తండాకు చెందిన ధరావత్ రాంజా వద్ద లక్ష రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. కొద్ది కాలానికి అనారోగ్యంతో కీమా మృతిచెందాడు. దీంతో అనిత బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నది. తమవద్ద తీసుకున్న డబ్బులు ఇవ్వాలని రాంజా అనితను చాలా రోజులుగా కోరుతున్నా ఆమె చెల్లించకపోవడంతో ఇటీవల రాంజా కుటుంబ సభ్యులు అనిత ఇంటికి పాత చెప్పులు, చీపురు, పాత చాటను దండగా కూర్చి తోరణంగా కట్టారు. అనంతరం ‘అనిత తమ అప్పు చెల్లించడం లేదని, గ్రామంలో ఎవరూ ఆమెకు అప్పు ఇవ్వవద్దు’ అని డప్పు చాటింపు చేయించారు. ఈ విషయాన్ని గ్రామస్తులు హైదరాబాదులో ఉన్న అనితకు సమాచారం ఇవ్వగా ఆమె శనివారం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. తన ఇంటికి చెప్పుల దండలు వేసి ఊర్లో చాటింపు వేయడంతో తాను తీవ్ర మనోవేదనకు గురవుతున్నానని, భర్త చనిపోవడంతో బతుకుతెరువు కోసం హైదరాబాదు వెళ్లి బతుకుతున్నారని, తనను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనిత ఫిర్యాదు మేరకు రాంజా, అతని కుటుంబ సభ్యులు ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ శంకర్‌నాయక్ తెలిపారు.

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం

బీబీనగర్: ఇంట్లో గొడవ పడి మనస్తాపానికి గురైన యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం బీబీనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ క్రిష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్‌లోని ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న ఎరుకలి మహేష్(28) ఖాళీగా ఉంటున్నాడు. తన తల్లి పెన్షన్ డబ్బులు వాడుకోవడంతో ఇంట్లో గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన మహేష్ శనివారం బీబీనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నామినీకి ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించాలని తీర్పు

రామగిరి(నల్లగొండ): నామినీకి ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన వక్కంటి తిరుపతయ్య హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 2020 ఫిబ్రవరిలో రూ.31,48,399తో మూడేళ్ల పాలసీ తీసుకున్నాడు. పాలసీలో కొడుకు వక్కంటి రాజాచంద్ర పేరును నామినీగా చేర్చాడు. తిరుపతయ్య అనారోగ్యం పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 2021 మే 7న మృతిచెందాడు. దీంతో నామినీ రాజాచంద్ర ఇన్సూరెన్స్ కంపెనీని ఆశ్రయించగా తిరుపతయ్య డయాబెటీస్, కాలేయ సంబంధిత వ్యాధితో చనిపోయాడని అందుకు పాలసీ డబ్బులు చెల్లించలేమని చెప్పారు. దీంతో రాజాచంద్ర 2022 మే 5న నల్లగొండలోని వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. ఇన్సూరెన్స్ కంపెనీ సరైన పత్రాలు సమర్పించకపోవడంతో కేసు విచారణ చేసిన కమిషన్ అధ్యక్షుడు మామిడి క్రిస్టోఫర్, సభ్యులు ఎస్. సంధ్యారాణి, కె. వెంకటేశ్వర్లు నామినీకి డబ్బులు చెల్లించాలని తీర్పు వెలువరించారు. బాధితుడికి రూ.31,48,399ను 2021 అక్టోబర్ 25 నుంచి 9 శాతం వడ్డీతో చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. అంతేకాకుండా మానసికంగా వేదనకు గురిచేసినందుకు ఇన్సూరెన్స్ కంపెనీ రూ.లక్ష పరిహారాన్ని ఇవ్వాలని, కోర్టు ఖర్చులకు రూ.10వేలు చెల్లించాలని కమిషన్ ఆదేశించింది.

పిడుగుపాటుతో మహిళ మృతి



నాగమణి (ఫైల్)

అడవిదేవులపల్లి: పిడుగు పడి మహిళ మృతిచెందిన ఘటన శనివారం అడవిదేవులపల్లి మండలంలో జరిగింది. మండలంలోని మొల్కచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని బాలాజీ తండాకు చెందిన జటావత్ నాగమణి(30) బాల్నేపల్లి శివారులో పాతులోతు హరికి చెందిన వ్యవసాయ పొలంలో పాతులోతు జ్యోతి, పాతులోతు శివితో కలిసి కలుపు తీసేందుకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వస్తుండగా.. ఉరుములు, మెరుపులు రావడంతో పిడుగు పడి నాగమణి అక్కడికక్కడే మృతిచెందింది. ముందు వెళ్తున్న మరికొంత మంది స్పృహతప్పి పడిపోయారు. సమీపంలోని కూలీలు వచ్చి వారిని మొల్కచర్లలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో...

హుజూర్‌నగర్ రూరల్: బట్టలు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మహిళ మృతిచెందింది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం అమరవరం గ్రామానికి చెందిన బూర్గుల నాగమణి(46) శనివారం తన ఇంట్లోని వరండాలో ఇనుప తీగపై ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి చిన్న కుమారుడు బూర్గుల రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


యాదాద్రి కొండపై ప్రత్యేక షెడ్డు



కొండపై ఏర్పాటు చేసిన షెడ్డు

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులు, చిన్న పిల్లల తల్లులు దర్శనానికి వెళ్లే సమయంలో బ్యాటరీ వాహనాల కోసం వేచి ఉండేందుకు కొండపై ప్రత్యేక షెడ్డును అధికారులు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన బుకింగ్ కౌంటర్, వీఐపీ కారు పార్కింగ్ సమీపంలో ఈ షెడ్డును నిర్మాణం చేశారు. బ్యాటరీ వాహనాలు నూతనంగా ఏర్పాటు చేసిన షెడ్డు వద్ద నిలుపుకొని, అక్కడి నుంచి నేరుగా భక్తులను ఆలయ మాడ వీధిలోకి తీసుకెళ్లేందుకు వీలుగా ఈ షెడ్డును ఆలయ అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు.

• పచ్చని చేలకు మబ్బుల గొడుగు



రామన్నపేట మండలం కొమ్మాయిగూడెంలో పంట చేలపై శనివారం అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ఆకాశంలో నల్లటి మబ్బులు పంట చేలపై చేతికందే ఎత్తులో చెట్లను తాకుతూ గొడుగు పట్టినట్లుగా కనిపించింది. - రామన్నపేట

క్లుప్తంగా

22న చలో కలెక్టరేట్

భువనగిరి : విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ ఈ నెల 22న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు గుండెబోయిన సురేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను పట్టణంలో విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 22న జరిగే కలెక్టరేట్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో శక్తి మిషన్ వ్యవస్థాపకులు కర్తాల శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు మోదిరాందేవ్ పాల్గొన్నారు.

పాతగుట్ట చౌరస్తాలో సర్కిల్ ఏర్పాటు చేయాలని వినతి



ఆర్‌అండ్‌బీ ఈఈకి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణం నుంచి పాతగుట్టకు వెళ్లే చౌరస్తా వద్ద సర్కిల్ ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఆర్‌అండ్‌బీ ఈఈకి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో గత ప్రభుత్వం పాతగుట్ట చౌరస్తా నుంచి నిర్మాణం చేసిన బ్రిడ్జిని తొలగించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బబ్బూరి శ్రీధర్, మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, పట్టణ కార్యదర్శి గోపగాని రాజు, మండల సమితి నాయకులు మాటూరి మల్లయ్య, వెంకటేష్, పోన్నబోయిన వెంకటేష్, శెట్టి మధు తదితరులున్నారు.

ఎంపీడీఓకు కార్యదర్శుల వినతి

బొమ్మలరామారం : పంచాయతీల్లో నిధుల కొరత తీర్చాలని పలువురు కార్యదర్శులు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్‌కు వినతిపత్రం అందజేశారు. 9నెలలుగా పంచాయతీల్లో నిధుల కొరత ఉందని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులకు, సిబ్బంది వేతనాలకు, ట్రాక్టర్‌ల నిర్వహణకు ఖర్చులు తడిసి మోపడవుతున్నాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రామానుజారెడ్డి, గణేష్, రమణ, భాను, శ్రీనివాస్, ప్రేమ్, మానస, లక్ష్మి ప్రసన్న, రాంబాబు, వెంకట్ రెడ్డి, విజయ్ కుమార్, నవీన్, జనార్దన్, హన్మంతు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఉత్తమ సేవకులకే గుర్తింపు

చౌటుప్పల్ : ఉత్తమ సేవకులకే సమాజంలో గుర్తింపు ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రాజుల సతీష్ అన్నారు. ఇటీవల బదిలీ అయిన పలువురు ఉద్యోగులకు శనివారం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సప్పిడి వెంకట్‌రెడ్డి, అనూష, కనుతాల సత్తిరెడ్డి, కొలను కృష్ణారెడ్డి, శ్రీరాంరెడ్డి, సత్యనారాయణ, మహేష్, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఎక్సలెన్స్ అవార్డు



వెంకటేశ్

ఆలేరురూరల్ : ఆలేరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న దూడల వెంకటేష్.. రాష్ట్ర స్థాయి టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు–2024కు ఎంపికయ్యారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్‌లో వెంకటేశ్‌కు అవార్డు ప్రదానం చేయనున్నట్లు స్పైక్ లైఫ్ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.

సామాజిక సేవ అభినందనీయం

బొమ్మలరామారం : రోటరీ క్లబ్, సుమంత్ ఐ ఆస్పత్రి వారు సంయుక్తంగా సామాజిక సేవలో భాగస్వాములు కావడం అభినందనీయమని సాయిధామం పీఠాధిపతి శ్రీ రామానంద ప్రభూజీ అన్నారు. మండలంలోని పెద్ద పర్వతాపూర్ గ్రామంలోని శ్రీ సాయిధామంలో గల హైస్కూల్ విద్యార్థులకు శనివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం రోటరీ క్లబ్ సౌజన్యంతో మండల కేంద్రంలోని జెడ్పీ హై స్కూల్‌కు రూ.33 వేల విలువైన మైక్ సెట్, చెత్త సేకరణ బుట్టలను అందజేశారు. కార్యక్రమంలో సాయిధామం మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ చంద్రారెడ్డి, రోటరీ క్లబ్ ప్రతినిధులు జ్ఞాన ప్రకాష్ రెడ్డి, ఉపేందర్ రావు, గుమ్మల మల్లేష్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకోని కాంగ్రెస్ సర్కార్

మోత్కూరు : రైతులందరికీ గత ఆగస్టు 15నాటికి రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ సర్కార్ మాట నిలబెట్టుకోలేదని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య విమర్శించారు. శనివారం మోత్కూరులోని కేఆర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటికీ 50 శాతం మంది రైతులకు మాఫీ చేయలేదన్నారు. అక్టోబర్ గడుస్తున్నా రైతు భరోసా విడుదల చేయక పోవడం దురదృష్టకరమన్నారు. వానాకాలం వరి కోతలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు జక్కా దయాకర్‌రెడ్డి, ఉప్పల కొమురయ్య, ఎలగందుల అంజయ్య, గోద స్వామి పాల్గొన్నారు.

ప్రహరీ లేక పరేషాన్



దాతర్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



ప్రహరీ లేని పాఠశాల ఆవరణ ఇలా ..

- యాదగిరిగుట్ట మండలంలోని పలు పాఠశాలలకు రక్షణ గోడలు కరువు
- విషకీటకాలు వస్తున్నాయని విద్యార్థుల ఆందోళన
- సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలంలోని పలు పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

పాఠశాలల్లోకి విష సర్పాలు

పాఠశాలలకు ప్రహరీలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆడుకునే సమయంలో పక్కనే ఉన్న చెట్ల పొదల నుంచి విష కీటకాలు, పందులు, కుక్కలు, పాములు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఇలా..

యాదగిరిగుట్ట మండలంలో 46 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 32, ప్రాథమికోన్నత పాఠశాలలు 12, అప్పర్ ప్రైమరీ పాఠశాలలు 2 ఉన్నాయి. ఇందులో దాతర్‌పల్లి, కాచారం, చిన్నకందుకూరు జెడ్పీహెచ్‌ఎస్‌లు, మైలార్‌గడ్డ తండా, మల్లిగూడెం, గౌరాయపల్లి, ప్రాథమికోన్నత పాఠశాలలకు ప్రహరీలు లేవు.

గోడ నిర్మించాలి



ప్రహరీ లేక ఆడుకునే సమయంలో పాఠశాలలోకి విష పురుగులు వస్తున్నాయి. వాటి బారిన పడకుండా ప్రహరీని నిర్మించడానికి నిధులు కేటాయించాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించాలి.

– మమత, విద్యార్థిని, చిన్నకందుకూరు

వినతిపత్రం అందజేశాం



దాతర్‌పల్లిలోని పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల పక్కన అటవీ ప్రాంతం ఉండడంతో విష పురుగులు వచ్చే ప్రమాదం ఉంది. ప్రహరీ నిర్మించాలని ప్రభుత్వ విప్‌కు వినతిపత్రం అందజేశాం.

–కాల్నె భాస్కర్, దాతర్‌పల్లి, మాజీ ఉపసర్పంచ్

'ఇంటిగ్రేటెడ్'ను మూడు నెలల్లో ప్రారంభిస్తాం

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



భువనగిరిలో మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు మూడు నెలల్లోగా పూర్తి చేయించి ప్రారంభిస్తామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డిని పెండింగ్ పనులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఆటోడ్రైవర్స్ అసోసియేషన్ జెండాను ఆవిష్కరించారు. సొసైటీ గౌరవ అధ్యక్షుడు పోత్నక్ ప్రమోద్ కుమార్, మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ మాయ దశరథ స్థానిక కౌన్సిలర్లు నజీమాన లావుద్దీన్, రత్నాపురం బలరాం ఉన్నారు.

కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ

భువనగిరి రూరల్ : గీత కార్మికుల రక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచాల కిట్లను ఎంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని అనాజిపురంలో గీత కార్మికులకు శనివారం కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, బీసీ వెల్ఫేర్ అధికారి యాదయ్య, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ నరేందర్, తహసీల్దార్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఐకేపీ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి

రైతులు ఐకేపీ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నందనం, నాగిరెడ్డిపల్లి, బొల్లెపల్లి, ఆకుతోటబావి తండా, పచ్చర్లబోడు తండాలో ఐకేపీ సెంటర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, చిక్కుల వెంకటేశం, నరాల వెంకటస్వామి తదితరులున్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ఆలేరురూరల్ : ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని సీపీఎం జిల్లా నాయకులు మొరిగాడి రమేష్, ఎంఎ ఇక్బాల్ అన్నారు. ఆలేరులోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు చేయలేదన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటుంటే ప్రభుత్వం మొద్దునిద్ర పోతుందని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఘనగాని మల్లేషం, కాసుల నరేష్, ఎండి మతిన్ ఎండి ఖలీల్, అఖిల్ దాసు పృథ్వీ, పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు జమ చేయాలి

మోత్కూరు : రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేయాలని మోత్కూరు రైతు సంఘం మండల కార్యదర్శి దడిపల్లి ప్రభాకర్ కోరారు. శనివారం మండలంలోని పాలడుగులో రైతు సంఘం కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వానా కాలం సీజన్ పూర్తి కావొస్తున్నా రైతులకు వ్యవసాయ పెట్టుబడికి రైతు భరోసా అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు పిట్టల చంద్రయ్య, గంటెపాక బుచ్చిరాములు, ముక్కాముల మత్స్యగిరి తదితరులున్నారు.

కారు బోల్తా.. ఒకరికి గాయాలు

చౌటుప్పల్ రూరల్: ముందు వెళ్తున్న కారును ఢీకొట్టి మరో కారు బోల్తా పడింది. ఈ ఘటన చౌటుప్పల్ మండలం ఎల్లంబావి సమీపంలో శనివారం మధ్యాహ్నం జరగగా.. ఒకరు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న స్విఫ్ట్ కారు చౌటుప్పల్ మండలం ఎల్లంబావి సమీపంలోకి రాగానే విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న వేగనార్ కారును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బోల్తా కొట్టిన కారులో వెళ్తున్న హైదరాబాద్‌కు చెందిన పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ లగావత్ రాంచంద్రునాయక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ముఖ్యమంత్రికి ఆహ్వానం



సీఎంను ఆహ్వానిస్తున్న ప్రీతమ్

మోత్కూరు : వచ్చే నెలలో రాష్ట్ర రాజధానిలో జరుగబోయే ఎస్సీ కార్పొరేషన్ స్వర్ణోత్సవాలకు హాజరు కావాలని మోత్కూరుకు చెందిన ఆ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నాగరిగారి ప్రీతమ్ శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. కార్పొరేషన్ సమస్యలపై సీఎంతో చర్చించినట్లు ఆయన తెలిపారు.

బేగంపేట వాగుపై రోడ్డు నిర్మాణం

రాజాపేట: మండలంలోని బేగంపేట వాగుపై బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్న సందర్భంగా గంధమల్ల చెర్వు నుంచి వస్తున్న గోదావరి జలాల ప్రవాహానికి రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని రోజులుగా పరిసర గ్రామాల ప్రజలు గంధమల్ల, పొట్టిమర్రి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 17న సాక్షి దినపత్రికలో 'వాగు దాటేదెలా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు శనివారం బేగంపేట వాగుపై తాత్కాలిక రోడ్డు నిర్మించారు. దీంతో బేగంపేట, రేణికుంట పరిసర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది.

సాక్షి ఎఫెక్ట్..



బేగంపేట వాగుపై రోడ్డు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఆత్మకూరు(ఎం): గ్రామీణ ప్రాంతాల్లోని కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ కోరారు. శనివారం మండలంలోని టి.రేపాకలో జరిగిన శ్రీరేణుకా ఎల్లమ్మ కోలాట బృందం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేసి బస్సు, రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడానికి స్థానిక కోలాట కళాకారులకు ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు. సమావేశంలో కోలాట బృందం అధ్యక్షురాలు ఏనూతల కవిత, మాధవి, అనురాధ, మంజుల, రాములమ్మ, మాధవి పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



సీఐ సాల్మన్‌రాజును సన్మానిస్తున్న యువకులు

ఆలేరురూరల్ : యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని ఆలేరు ఎస్ఐ రజనీకర్ సూచించారు. శనివారం ఆలేరు పట్టణ కేంద్రంలోని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్ లైన్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రగ్స్ వాడినా, అమ్మినా చట్టం ప్రకారం నేరమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పూజారి వెంకటేశ్వర్లు, చైల్డ్ ప్రొటెక్షన్ సభ్యులు శ్రీహరిబాబు, స్వప్న, నందిని, సురేష్, అధ్యాపకులు రవీందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఆత్మకూరు(ఎం): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆత్మకూరు(ఎం) సీఐ సాల్మన్ రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో సీఐ సాల్మన్ రాజును సన్మానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో శివాజీ యువజన మండలి అధ్యక్షుడు కోరె మల్లేశం, ప్రధాన కార్యదర్శి మజ్జిగ నరేష్, సభ్యులు దిగోజు శ్రీనువాస్, రాగటి సత్యనారాయణ. బండ శివాజీ, మురారిశెట్టి సందీప్, తొండల అనిల్‌కుమార్, మల్ల క్రాంతి, పంజాల రాజు, ఉగ్గె ప్రమోద్, లోడి మణికంఠ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన

భూదాన్‌పోచంపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు కోట రాంచంద్రారెడ్డి, ప్రసాదం విష్ణు అన్నారు. సోమవారం పోచంపల్లి, కనుముకుల, భీమనపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.కార్యక్రమంలో మంచాల మధు, కృష్ణారెడ్డి, జగన్ తదితరులు ఉన్నారు.

కేంద్రాలు ప్రారంభించకుంటే ఉద్యమిస్తాం

బొమ్మలరామారం : ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుంటే రైతుల పక్షాన పోరాడుతామని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫక్కీరు రాజేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన కిసాన్ మోర్చా మండల కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో రవీందర్ రెడ్డి, గుండ్ల గోపాల్, రవి శంకర్, మధు, గణేష్ పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

బీబీనగర్: ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి కోరారు. మండలంలోని వెంకిర్యాలలో శనివారం నిర్వహించిన సీపీఎం మహాసభలో పాల్గొని మాట్లాడారు. సభలో సయ్యద్ ఉమర్, శ్రీనివాస్, సుబ్బారెడ్డి ఉన్నారు.

దేశభక్తులను తయారు చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్

- బీబీనగర్ ఎయిమ్స్ హెచ్ఓడీ డాక్టర్ ప్రజ్ఞేష్ పర్మర్



మాట్లాడుతున్న డాక్టర్ ప్రజ్ఞేష్ పర్మర్

భూదాన్‌పోచంపల్లి : ఆర్‌ఎస్‌ఎస్ దేశభక్తులను తయారు చేస్తుందని, ఇది దేశానికి ఎంతో అవసరమని బీబీనగర్ ఎయిమ్స్ హెచ్ఓడీ డాక్టర్ ప్రజ్ఞేష్ పర్మర్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో పోచంపల్లి ఆర్‌ఎస్‌ఎస్ ఖండ ఆధ్వర్యంలో విజయదశమి పద సంచలన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెడ్పీస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సనాతన హిందూధర్మం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్, జిల్లా సంఘచాలక్ బాదం ప్రకాశ్, కటకం నరహరి, తాడెం పాండు, అంశాల అరవింద్, కాసోజు శివ, బేతి కన్నయ్య, కుడికాల సంతోష్, భిక్షపతి, ఎన్నం శివకుమార్, సీత చక్రపాణి, సుదర్శన్, చంద్రశేఖర్, పాండురంగం, గంజి బస్వలింగం పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

మోత్కూరు : మోత్కూరు పట్టణంలోని అన్నెపువాడకు చెందిన నర్సింహాసునీతా దంపతుల కుమార్తె క్రాంతి ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. ఆమెను శనివారం మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, రెడ్‌క్రాస్ సొసైటీ యాదాద్రి జిల్లా చైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కారుపోతుల వెంకన్న, అన్నెపు పద్మ, మంగమ్మ పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న నాయకులు

రైతు సంక్షేమానికి సర్కార్ ప్రాధాన్యం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



సిరిపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట : రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని నకిరేకల్‌ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్, ఎఫ్‌పీఓల ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ నంద్యాల భిక్షంరెడ్డి, వైస్‌చైర్మన్ అంబటి ఉపేంద్రమ్మరవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సి.లాల్‌బహదూర్, ఎంపీడీఓ బి.యాకుబ్‌నాయక్ ఏపీఎం రాంప్రసాద్, సీఈఓ జి.జంగారెడ్డి సిరిగిరెడ్డి మల్లారెడ్డి నాయకులు గంగుల వెంకటరాజిరెడ్డి, పూస బాలకిషన్, గుత్తా నర్సిరెడ్డి, గంపల రాంచంద్రారెడ్డి, కూనూరు సాయికుమార్, అప్పం లక్ష్మీనర్సు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుంటే ప్రజా ఉద్యమాలు



సమావేశంలో మాట్లాడుతున్న గొంగిడి సునీత

- ఆలేరు మాజీ ఎమ్మెల్యే సునీత

ఆలేరురూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. ఆలేరు గెస్ట్‌హౌస్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో మాజీ మంత్రి కేటీఆర్‌తో పోరాడి ఆలేరు మున్సిపాలిటీ అభివృద్ధికి స్పెషల్ ఫండ్స్ కింద రూ.15 కోట్ల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ఆలేరు ప్రాంతానికి మంజూరైన నిధులను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఎందుకు అడ్డుకుంటున్నారో ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, మాజీ వైస్ ఎంపీపీ కొరుకొప్పుల కిష్టయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరక్టర్ కుండె సంపత్, పత్తి వెంకటేష్, దాసి సంతోష్, శ్రవణ్, కొలపుల హరినాథ్, జూకంటి ఉప్పలయ్య, చింతకింది మురళి, ఎండి ఫయాజ్, అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ దేవాలయాలకు రక్షణ కల్పించాలని ర్యాలీ

చౌటుప్పల్ : హిందూ దేవాలయాలకు రక్షణ కల్పించాలని భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ గోగు రవీందర్, వీహెచ్‌పీ జిల్లా సహాయ కార్యదర్శి గరిశె శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శనివారం వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో దేవాలయాలపై దుండగులు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఆలయాలపై దాడులకు పాల్పడుతున్న దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్, మండల అధ్యక్షులు గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేష్, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ప్రతినిధులు కృష్ణ, వెంకట్‌రెడ్డి, బాగగోని రోహిత్, శివశంకర్, శభరిని పవన్, సూరజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉగ్రవాద దాడులను అరికట్టాలని ధర్నా

భువనగిరి : ఆలయాలపై ఉగ్రవాద దాడులను అరికట్టాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర సహ కార్యదర్శి తోట భానుప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా శనివారం వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక వినాయక చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొకల సందీప్, చామ రవీందర్, బురుగు సంతోష్‌రెడ్డి, మనోహర్, మల్లికార్జున్, బింగి భరత్, సతీష్, భాను, శ్రవణ్‌కుమార్, నవీన్, రత్నపురం బలరాం, మహేందర్ గుప్తా, కౌన్సిలర్ కవితానర్సింహాచారి పాల్గొన్నారు.



చౌటుప్పల్: వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు

భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేయొద్దు



రామన్నపేటలో మానవహారం ఏర్పాటు చేసిన విద్యార్థులు, యువకులు

- సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ

రామన్నపేట : సిమెంట్ పరిశ్రమను ఏర్పాటుచేసి తమ భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేయొద్దని విద్యార్థులు, యువకులు నినదించారు. రామన్నపేట శివారులో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో వివిధ పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. సుభాష్ విగ్రహం సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయొద్దు –మా భవిష్యత్‌ను ఆగం చేయొద్దు వంటి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ వేదిక మండలకన్వీనర్ జెల్లెల పెంటయ్య, కోకన్వీనర్ ఎండీ రెహాన్ మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధులకు కారణమయ్యే సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధపార్టీల నాయకులు పోచబోయిన మల్లేశం, ఊట్కూరి నర్సింహ, బొడ్డుపల్లి వెంకటేశం, కన్నెబోయిన బలరాం, మీర్జా ఫజల్ బేగ్, గూని రాజు, నకిరేకంటి నరేందర్, విద్యార్థిసంఘాల నాయకులు ఎల్.రాజు, ఎన్.గణేష్, జి.శివ, వివిధపాఠశాలల కరస్పాండెంట్లు తిరుగుల మల్లికార్జున్, జేఎస్ మార్టిన్, గంగుల నరేందర్‌రెడ్డి, ఎస్‌కే చాంద్, నీల ఐలయ్య, వెంకటేశ్వర్లు, మేకల జలేందర్, పుట్టల ఉదయ్, తుర్కపల్లి నరేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఓటు నమోదు చేసుకోవాలి

ఆలేరురూరల్ : అర్హత గల ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని ఏపీయూఎస్, టీపీయూఎస్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి కోరారు. శనివారం ఆలేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దూడల వెంకటేష్, దాసరి మంజుల, సత్యనారాయణరెడ్డి, నరేంద్రస్వామి, రేష్మ, పరమేష్, మల్లేశం, రోహిణి, రాధిక, శ్రీధర్ పాల్గొన్నారు.

గ్రామసభల్లోనే కమిటీలు ఎంపిక చేయాలి

వలిగొండ : ఇందిరమ్మ అభివృద్ధి కమిటీలను గ్రామ సభల్లోనే ఎంపిక చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ అన్నారు. శనివారం ఆయన ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సుద్దాల సాయి కుమార్ తో కలిసి స్థానిక ఎంపీడీఓ జితేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ

వలిగొండ : మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక ముస్తఫా చికెన్ సెంటర్ యజమాని ఎండి దస్తగిరి శనివారం పరీక్షా ప్యాడ్‌లు, టై బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుంకోజు భాస్కర్, బచ్చు శ్రీనివాస్, పోలేపాక భిక్షపతి, నాగేల్లి వలి, బత్తిని నగేష్ గౌడ్ పాల్గొన్నారు.

చెరువులు, కుంటలు నింపాలి

గుండాల : నవాబుపేట రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలతో మండలంలో ఉన్న అన్ని చెరువులు, కుంటలు నింపాలని సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన వెంట పి.సత్యనారాయణ, ఎం.డి.ఖలీల్, ఈ.అంజయ్య, బాలయ్య, బత్తిని భిక్షం ఉన్నారు.

మంత్రి ప్రభాకర్‌కు కృతజ్ఞతలు

మోత్కూరు : గురుకుల విద్యాలయ ప్రైవేట్ భవన యజమానులకు ప్రభుత్వం పాక్షికంగా బకాయిలు విడుదల చేసినందుకు శనివారం హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయ అద్దె భవనాల యజమానుల సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల అద్దె భవన యజమానులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని మంత్రిని కోరినట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చాగోని సత్యం గౌడ్ తెలిపారు.

కాంగ్రెస్ వైఖరి స్పష్టం చేయాలి

మోత్కూరు : రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాకూబ్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన పేరుతో రూ.లక్షల కోట్లు దోచుకోవడానికి సిద్ధపడుతున్నారని ఆరోపించారు.

కంప్యూటర్ బహూకరణ

అడ్డగూడూరు : మండలంలోని కోటమర్తిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన రేణుకారాణి రూ.72వేల విలువ గల కంప్యూటర్, ప్రింటర్‌ను శనివారం హెచ్‌ఎం రాజవర్ధన్, ఎంఈఓ సబితకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సైదులు, రవీందర్, రాంచద్రయ్య, ఉష, ఎడీఏ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

బోరు పనులు ప్రారంభం

రామన్నపేట : మండలంలోని ఇంద్రపాలనగరంలో అయ్యప్పస్వామి దేవాలయం వద్ద ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో వేసే బోరు పనులను శనివారం మాజీ ఎంపీపీ పూస బాలమణి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ పూస బాలనర్సింహ, పూస బాలకిషన్, గర్దాసు సురేష్, మందడి గోపాల్‌రెడ్డి, మల్లం కృష్ణమూర్తి ఉన్నారు.

సర్టిఫికెట్లు ప్రదానం

బీబీనగర్: నాలుగు రోజులుగా ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ పొందిన గ్రామ మంచినీటి సరఫరా సహాయకులకు శనివారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ లలిత, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రశాంత్‌కుమార్, ఏఈ రవికిరణ్, గ్రిడ్ ఏఈ స్వాతి పాల్గొన్నారు.